క్లుప్తంగా

రాజ్యలక్ష్మీ తాయార్లకు లక్ష మల్లెల అర్చన


మల్లెల అర్చనలో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని జనార్దన స్వామి, రంగనాయక స్వామి వార్ల తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వార్లకు సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు నిర్వహించారు. ఉత్సవ పూర్ణాహుతి నిర్వహించి, ధ్వజావరోహణం చేశారు. సాయంత్రం రాజ్యలక్ష్మీ తాయార్లకు సేవా కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో లక్ష మల్లెల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పెదపాడులో 'నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం'

పెదపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ అన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్దే రామసీత, సర్పంచ్ చిన్నాల ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

చండీహోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి దివ్యసన్నిధిలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ మండపంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మహాసంకల్పం, మండపారాధన, అమ్మవారికి షోడశోపచారాలతో పూజాధికాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో 61 వ చండీహోమం నిర్వహించారు.

బాపనయ్య వర్ధంతి సభ

ఏలూరు (టూటౌన్): చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాట నాయకుడు గుంటూరు బాపనయ్య 46వ వర్ధంతి సభ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పవరుపేటలోని అన్నే వెంకటేశ్వరరావు భవనంలో ఎం.జీవరత్నం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారని తెలిపారు.

ప్రగతిపథంలో పల్లెలు


చాటపర్రు 1వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు


పెదయాగనమిల్లిలో నిర్మించిన సచివాలయం భవనం

- ఏలూరు మండల గ్రామాల్లో రూ.388.55 కోట్ల ఖర్చు
- అభివృద్ధికి రూ.106.40 కోట్లు
- పథకాలకు రూ.282.15 కోట్లు



ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలనసాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు రూరల్ మండలం దెందులూరు నియోజకవర్గంలోని 15 గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం తదితర మౌలిక వసతుల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఈ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 500కుపైగా అభివృద్ధి పనులు చేపట్టింది. సుమారు రూ.106.40 కోట్లు ఖర్చు చేసింది. సంక్షేమ పథకాల కోసం రూ.282.15 కోట్లు వెచ్చించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మల్కాపురం, చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు, కలకుర్రు, కాట్లంపూడితో పాటు లంక గ్రామాల్లో అభివృద్ధి చెందాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సుమారు రూ.100 కోట్లతో చేపట్టిన రూఅర్బన్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటి వరకూ గ్రామాల్లో 11 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. మరో రూ.10 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో సుమారు 20 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.1.40 కోట్లు మండల పరిషత్ నిధులతో కొక్కిరాయిలంకలో గ్రావెల్ రోడ్లు, మల్కాపురంలో డ్రెయినేజీ పైడచింతపాడులో సీసీ రోడ్డు, మాదేపల్లి, చాటపర్రులో ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు చేయించారు. బోర్లు తవ్వించారు. తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురంలో సుమారు రూ.12 లక్షలతో కల్వర్టులు నిర్మించారు. రూ.20 కోట్లతో కైకలూరు రోడ్డు, శ్రీపర్రు వంతెన నిర్మించారు. మరో రూ.4 కోట్లతో కొల్లేరు రోడ్లను అభివృద్ధి చేశారు. గ్రామానికి సుమారు రూ.1 కోటి చొప్పున మొత్తంగా 15 గ్రామాల్లో రూ.15 కోట్లతో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ క్లినిక్ భవనాలు నిర్మించారు. మరో రూ.3 కోట్లు నాడు–నేడు నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. విద్యుత్ శాఖ రూ.4 కోట్లతో గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మించారు. జగనన్నకాలనీల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు.


గుడివాకలంకలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

పథకాలతో ఆర్థిక స్వావలంబన

ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు పేదల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయి. అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ, పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ.. ఇలా మొత్తంగా 26 పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 61,310 మంది లబ్ధిదారులకు మేలు చేశారు. వీరిక ఐదేళ్లలో రూ.282,15,30,012 అందజేశారు.

మా ఊరు మారింది



ఐదేళ్లలో ప్రభుత్వం మా ఊళ్లో ఎన్నో మార్పులు చేసింది. వాటర్ ట్యాంక్ కట్టారు. తాగునీరు పైప్‌లైన్ వేశారు. ఇంటింటికీ కుళాయి బిగించారు. వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించారు. వైఎస్సార్ క్లినిక్ భవనం కట్టారు. అక్కడే పేదలకు మూడుసార్లు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. సచివాలయం కట్టారు. అందులో ఉద్యోగులు అందరూ ఉంటున్నారు. సంక్షేమ పథకాలన్నీ అక్కడ నుంచే అందజేస్తున్నారు. జగన్ పాలన నాకు బాగా నచ్చింది.

– ఎస్ కృష్ణ, కోటేశ్వరదుర్గాపురం

ప్రత్యక్ష అభివృద్ధి



ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు చేసి చూపాం. పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేశాం. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్ల నిధులు మంజూరు చేయడం గొప్ప విషయం. మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటుచేశారు. గతంలో ఏ ప్రభుత్వం రూ.కోట్లు నిధులు విడుదల చేయలేదు.

– పెనుమత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

జగనన్న సంక్షేమ పాలనకు ప్రజాదరణ


కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్

దెందులూరు: ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం రాత్రి మేధినరావుపాలెం, ధర్మారావుపేట, కొవ్వలివారిగూడెంలో గ్రామ సర్పంచ్ మనుబోలు దుర్గాకుమారి రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మేము సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మేధినరావుపాలెం దళిత వీధిలో భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు గ్రామాల్లో ఏర్పాటుచేసిన సభల్లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ మేధినరావుపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గ్రామస్తుల హర్షాధ్వానాల మధ్య ప్రకటించారు. మేధినరావుపాలెం, ధర్మారావుపేట, కొవ్వలివారిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌లకు అడుగడుగునా, వీధివీధినా మూడు గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. మూడు గ్రామాల్లో తమకు ఆదరించిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి కృతజ్ఞతలు తెలిపారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు నిట్టా గంగరాజు, బత్తుల ఏసురాజు, గ్రామ మాజీ సర్పంచ్ అంగడాల సీతారావమ్మ, సుబ్బారావు, మేడికొండ రాజా, జొన్నకూటి మంగరావు, నేతల సుబ్బారావు, రొక్కం పాపారావు, ఫకీరు, గంగాధరరావు, చేట్ల శ్రీను, బాలిన శ్రీను, పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, రామారావుగూడెం గ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వనితను భారీ మెజార్టీతో గెలిపించాలి


వేంపాడులో నాయకులతో మాట్లాడుతున్న జీవీ

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ, పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) సూచించారు. మండలంలోని దొరసానిపాడు, వేంపాడు గ్రామాల్లో సోమవారం ఆయన పార్టీ ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించారు. నాయకులకు ఏవైనా మనస్పర్థలు ఉంటే వాటిని పక్కనబెట్టి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గోపాలపురం ఎమ్మెల్యేగా హోం శాఖ మంత్రి తానేటి వనితను అత్యధిక మెజారిటీతో గెలిపించి, కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ మండల నాయకులు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ తదితరులున్నారు.

7న తేటతేట తెలుగులా..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న క్రోధినామ సంవత్సర ఉగాది ఉత్సవాలను తేటతేట తెలుగులా పేరిట నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం సుభాని తెలిపారు. ఈ కార్యక్రమ కరపత్రం సోమవారం స్థానిక ఘంటసాల స్వరపీఠం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ ఘంటసాల పాటల్లోని మాధుర్యాన్ని నేటి తరానికి అందించడానికి తేటతేట తెలుగులా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గాయనీమణులు బీకే బిందు, వహీదా వాసులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, సభ్యులు లంకా వెంకటేశ్వర్లు, వై.అర్జునరావు, నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ఆనందాల హోలీ

ఏలూరు (టూటౌన్) : స్థానిక ఇండోర్ స్టేడియంలో ఇండోర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హోలీ వేడుక నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, యువత ఒకరిపైఒకరు రంగులు చల్లుకుని సందడి చేశారు. ఏలూరు జిల్లా జాలి వాకర్ మల్లిపూడి రాజు మాట్లాడుతూ హోలీ కుల మతాలకు అతీతంగా అందరూ ఆనందంగా నిర్వహించుకునే పండుగ అని అన్నారు. కార్యక్రమంలో ఇండోర్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిలగల కొండలరావు, అధ్యక్షుడు రాఘవ, జాయింట్ సెక్రెటరీ కారంపూడి విజయ్ కుమార్, గరికపాటి దుర్గారావు, సభ్యులు పార్థసారథి, లక్ష్మణ్, నాగేశ్వరరావు, యార్లగడ్డ మురళి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు


సామూహిక శ్రీ లక్ష్మీ జయంతి పూజల్లో పాల్గొన్న భక్తులు


సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఫాల్గుణ మాస పౌర్ణమి ఉత్తర నక్షత్రం మహాలక్ష్మీ అమ్మవారి జన్మదినం సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయంలో ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, శ్రీ లక్ష్మీ హోమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం లక్ష్మీ నారాయణుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అర్చకుడు ఊటుకూరి సాయి శర్మ పూజలు చేయగా, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దొండపాడులో..

శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అర్చన, శ్రీ సూక్త పారాయణం, శ్రీ మహాలక్ష్మీ మంత్ర జపం, భక్తులచే సామూహికంగా 100 సార్లు శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రపారాయణం నిర్వహించారు. సాయంత్రం సౌందర్య లహరి పారాయణ, లక్ష్మీ గణపతి, నవగ్రహ నక్షత్ర, మృత్యుంజయ హోమం, మహాలక్ష్మీ మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. క్షేత్రం అర్చకుడు ఘంటసాల రామకృష పూజలు చేయగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆగమ పాఠశాలలో శ్రీలక్ష్మీ జయంతి వేడుక


ఆగమ పాఠశాలలో శ్రీలక్ష్మీ అమ్మవారు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురంలోని శ్రీవారి దేవస్థానం ఆగమ పాఠశాలలో శ్రీలక్ష్మీ జయంతి వేడుకలను ఆగమ విద్యార్థులు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమినాడు శ్రీలక్ష్మీ జయంతి వేడుకలను ఇక్కడ జరపడం సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా పాఠశాల ఆవరణలో అమ్మవారి ప్రతిమకు ఆగమ విద్యార్థులు విశేష పూజాలు జరిపారు. క్షీరసాగర మదనంలో ముందు హాలాహలం ఉద్భవించగా, చివరిలో లక్ష్మీమాత జన్మించినట్టు పురాణాలు చెబుతున్నాయని విద్యార్థులు తెలిపారు. భక్తితో అమ్మవారిని ఆరాధిస్తే లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	20	కంద	74
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	24-36	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	44	అల్లం	160
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32-38	పాలకూర	10
దొండకాయలు	18	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	24-26	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు -తిరుపతి	16.00	4830	34

జగన్ పాలనలోనే పేదలకు న్యాయం


కొత్తపల్లిలో దివ్యాంగుడి సమస్య వింటున్న ఎమ్మెల్యే వాసుబాబు


వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలోనే పేదలందరికీ నూరుశాతం న్యాయం జరిగిందని, ఇలాంటి సంక్షేమ పాలనను మరోసారి తెచ్చుకునే బాధ్యత మనందరి పైనా ఉందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం కొత్తపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికీ అందిన లబ్ధిని, గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ సంపన్నుల గురించి తప్ప పేదల గురించి ఆలోచించని చంద్రబాబు ఇప్పుడు పేదలు, బీసీ, ఎస్సీలంటూ దొంగజపం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలను ఎలాంటి సిపార్సులు, లంచాలు లేకుండా నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని వివరించారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. జగన్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగిందన్నారు. వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్న కోరిక రాష్ట్ర ప్రజలందరిలో కనిపిస్తుందని, అందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీలు పొత్తులు పెట్టుకుని ప్రజలను మోసంచేసి అధికారం పొందడానికి కుటిల పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. ఇలాంటి వారికి గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ ఆర్ధవరం రాము, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్ మద్దాల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల నాగేశ్వరరావు, మండల గృహసారథుల కన్వీనర్ మద్దాల రామకృష్ణ, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, మద్దాల మధు, నిమ్మల అంజిబాబు, గుర్రం సుబ్బారావు, కురెళ వెంకటరత్నం, మండ భాస్కరరావు, మద్దా ముత్యాల నాయుడు, ఆలమూరి గాబ్రియేల్, తోట వెంకటరత్నం, మద్దాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

దెందులూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో దెందులూరులో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఒకవైపు సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంతమైన వాతావరణం కల్పించటంతోపాటు, మరోవైపు నగదు, మద్యం, నాటుసారా, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘా పెట్టారు. మండలంలోని ఎలక్షన్ కోడ్ అమలులో భాగంగా గ్రామాల్లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఆదేశాల మేరకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆరు టీమ్‌లు అన్ని గ్రామాల్లో ప్రతి వాహనంలో అన్ని బ్యాగులు, సూట్‌కేసులను తనిఖీ చేస్తున్నారు.

రూ.82 వేల సీజ్

ఉంగుటూరు: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సోమవారం గణపవరం మండలం సరిపల్లి వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.82 వేలు సీజ్ చేసినట్టు ఉంగుటూరు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖాజావలీ వెల్లడించారు. నగదు తీసుకువెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు.

'అనన్య' టీమ్ విజయోత్సవం

జంగారెడ్డిగూడెం: ప్రేక్షకుల ఆదరణే సినిమాకు ప్రాణమని అనన్య చిత్రం డైరెక్టర్ బి.ప్రసాద్‌రాజు అన్నారు. ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందిన అనన్య చిత్రం విజయోత్సవ సంబరాలు ఇక్కడ నిర్వహించారు. అనన్య చిత్రం యూనిట్ శనివారం రాత్రి స్థానిక శ్రీ రాజ రాజేశ్వరి టాకీస్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా చిరంజీవి యువత అనన్య యూనిట్‌ను ఘనంగా సన్మానించారు. ప్రాంతీయ బ్రహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కూడా సినిమా బృందం సభ్యులను సత్కరించారు. చిత్ర దర్శకుడు ప్రసాద్ రాజు మాట్లాడుతూ చిన్న చిత్రాల విజయానికి ప్రేక్షకుల పెద్ద మనస్సే కారణం అన్నారు. హీరో జైరామ్ జుత్తిగ, హీరోయిన్ చందన, విలన్ అరవింద్, తదితరులు హాజరయ్యారు.

పట్టువస్త్రాల సమర్పణ

లింగపాలెం: లింగపాలెం సరమ్మ పేరంటాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీటిని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈఓ కొండలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు నూజివేటి ఏడుకొండలు, జెట్టి దుర్గమ్మ, పరపతి భాగ్యలక్ష్మి, మద్ది ఆలయ ఆహ్వానితులు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.